సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం। 18। ఏప్రిల్। 2023



బాధిత కుటుంబాలకు అండగా..
పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో మృతిచెందిన సిబ్బందికి సంబంధించి వారి కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,560
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,588
3 శాతం జీఎస్టీతో	రూ.5,756
సవర (8 గ్రా)	రూ.46,048

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /25.5

వాతావరణం
సోమవారం గాలిలో 40 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. మంగళవారం అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం (సా)	బుధవారం (ఉ)
6.25	4.33



రొట్టెల పండగ సమయంలో స్వర్ణాల చెరువు తీరంలో జనసందోహం (ఫైల్)

అడిగిన వెంటనే..

ముస్లింలకు సీఎం వైఎస్ జగన్ కానుక
- బారాషహీద్ దర్గా అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు
- దర్గా, స్వర్ణాల చెరువు వద్ద నదుపాయాల ఏర్పాటుకు చర్యలు
- మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల ప్రత్యేక చొరవ

రొట్టెల పండగ.. దీని గురించి తెలియని వారు ఉండరు. ప్రతి సంవత్సరం బారాషహీద్ దర్గా వద్ద ఈ పండగ ఎంతో ఘనంగా జరుగుతుంది. దర్గా అభివృద్ధికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంది. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. దర్గా అభివృద్ధికి నిధులిచ్చారు. ఇందుకు మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులో ఉన్న బారాషహీద్ దర్గాకి దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ప్రతి సంవత్సరం మొహర్రం అనంతరం జరిగే రొట్టెల పండగకు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది కులమతాలకు అతీతంగా వస్తుంటారు. స్వర్ణాల చెరువులో స్నానమాచరించి రొట్టెల మార్పిడి అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయనేది భక్తుల నమ్మకం. రొట్టెల పండగను ప్రభుత్వం ఐదురోజులపాటు ఘనంగా నిర్వహిస్తుంది.

ఎంతో పేరున్న బారాషహీద్ దర్గాలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో గత ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఈ పండగను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తూ జరిపిస్తోంది. ప్రతి సంవత్సరం భక్తుల తాకిడి పెరుగుతుండడంతో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం నడుం బిగించింది. దర్గా స్వర్ణాల చెరువు ఒడ్డున ఎంతో ఆహ్లాదకమైన వాతావరణంలో ఉంటుంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చెరువులో



బారాషహీద్ దర్గా (ఫైల్)

బోటుషికార్ ఉంది. ప్రాముఖ్యత ఉన్న దర్గా అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.15 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ప్రత్యేక చొరవ

దర్గాలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలకు గత సంవత్సరం హామీ ఇచ్చింది. తాజాగా నిధులు విడుదల కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాగా నాలుగు పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మరో రెండింటికి టెండర్లు పిలవాల్సి ఉంది. పలు పనులను ప్రారంభించారు. పవిత్ర రంజాన్ మాసంలో దర్గా అభివృద్ధికి వేగంగా చర్యలు తీసుకోవడంపై ముస్లిం వర్గాల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి.

అభివృద్ధి పనులిలా..
- దర్గా కాంప్లెక్స్ అభివృద్ధి, స్వర్ణాల చెరువు వద్ద మౌలిక సదుపాయాల కల్పన, ప్రతిపాదిత స్థలంలో పనులు చేపట్టడానికి ఆక్రమణల తొలగింపు.
- దర్గా ప్రాంగణంలో మసీదు నిర్మాణం.
- మీనార్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్, మార్బుల్ ఫ్లోరింగ్. దర్గాతోపాటు చిన్న దర్గాల్లో రౌండ్ వెడల్పు.
- దర్గా కాంప్లెక్స్, సమీపంలో గెస్ట్ రూముల నిర్మాణం.
- దర్గా దక్షిణం వైపు కాంపౌండ్‌తోపాటు దుకాణాలు, కార్యాలయాల నిర్మాణం. అలాగే సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేయనున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది



పవిత్రమైన రంజాన్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం బారాషహీద్ దర్గా అభివృద్ధికి నిధులివ్వడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు చేయలేని పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపిస్తోంది. నిధుల విషయంలో కృషి చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– సయ్యద్ అబూబకర్, బారాషహీద్ దర్గా మాజీ చైర్మన్, నెల్లూరు

రంజాన్ కానుక ఇచ్చారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రంజాన్ కానుకగా బారాషహీద్ దర్గా అభివృద్ధి కోసం నిధులిచ్చారు. దర్గాకు కులమతాలకు అతీతంగా భక్తులు వస్తుంటారు. వారికి సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. నిధులు కేటాయింపులో చొరవ చూపిన నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– ఇస్మాయిల్ ఖాద్రీ, దర్గా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు, నెల్లూరు

సీఎం ఆదేశాలతో దర్గా అభివృద్ధికి నిధులు

- రూరల్ ఎమ్మెల్యేని చూసి నిధులివ్వలేదు
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేవి డ్రామాలు
- నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా అభివృద్ధికి సంబంధించి నిధుల క్లియరెన్స్ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రంజాన్ మాసం ప్రారంభమైన రోజు కలిస్తే అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదాల సోమవారం దర్గా వద్దకు విచ్చేశారు. రంజాన్ పండగను పురస్కరించుకుని అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు భయపడి నిధులిచ్చారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిధుల విడుదలకు సంబంధించి ఫైనాన్స్ క్లియరెన్స్ రావాలంటే కనీసం 10 నుంచి 15 రోజులు పడుతుందన్నారు. అయితే సీఎం నిధుల విడుదల విషయంలో అప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. త్వరలో వినాయక ఘాట్ పనులు ప్రారంభంకానున్నాయని, శ్రీధర్‌రెడ్డి ఇది తెలుసుకుని మళ్లీ పోరాటం అంటున్నాడని ఎద్దేవా చేశారు. రూరల్ ఎమ్మెల్యే డ్రామాలను ఎవరూ నమ్మాల్సిన అవసరం లేదన్నారు. సీఎం సహాయ సహకారాలతో నెల్లూరు రూరల్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న రొట్టెల పండగను ఘనంగా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ సలీం, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు వాసంతి, రియాజ్, సత్తార్, మోబీనా, బొబ్బల శ్రీనివాసయాదవ్, మూలే విజయభాస్కరరెడ్డి, అవినాష్, దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి మైనార్టీ నేతలు కంతర్ అలీ, అబూబకర్, సమీర్, అల్లాభక్షు, దర్గా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



దర్గా వద్ద మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

న్యూస్‌రీల్

స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలి
- కలెక్టర్ హరినారాయణన్



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్): స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జేసీ కూర్మనాథ్, ఏపీ మారిటైన్ బోర్డు అధికారి పద్మావతి తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో నిర్వహించిన సమీక్ష మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించలేకపోతే అందుకు అధికారులు సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జెడ్పీ సీఈఓ చిరంజీవి, మైనార్టీ సంక్షేమాధికారిణి కనకదుర్గాభవాని, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల శాఖ ఏడీ నాగరాజకుమారి, సర్వే అండ్ ల్యాండ్ శాఖ ఏడీ హనుమాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

889 పొగాకు బేళ్ల విక్రయం




ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం పొంగూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 932 బేళ్లు వేలానికి తీసుకురాగా 889 బేళ్లు కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 43 బేళ్ల తిరస్కరించారు. కిలోకి గరిష్ఠంగా రూ.200, కనిష్ఠంగా రూ.174 ధర లభించింది. మొత్తంగా 1,17,445.2 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,26,00,754ల వ్యాపారం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉలవపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చాగల్లు–చాకిచర్ల మధ్య సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని పెదపట్టపుపాళెం గ్రామానికి చెందిన వాయల వెంకటేశ్వర్లు (40) చాగల్లు నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. మధ్యలో పంట కాలువ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి పడిపోయాడు. ఈ క్రమంలో కాలువ దిమ్మెకు తల తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించేలోపు మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమశిలలో 52.392 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 52.392 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 365 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. కాగా పెన్నార్ డెల్టాకు 250 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 303, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.737 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 342 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

పనులు ప్రారంభిస్తున్నాం.. పూర్తి చేస్తున్నాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: 'గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితమైంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పనులు ప్రారంభించడమే కాకుండా వేగంగా పూర్తి చేస్తున్నాం.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముద్దుమూడి, చెరుకుమూడి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న మంత్రి అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారదర్శక పాలనతో ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నా రు. గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నేరుగా ప్రతి కుటుంబాన్ని కలిసి సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని వారికి అందించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ఉపయోగపడేలా కొత్త పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్న వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. ఇచ్చిన ప్రతి హామీని ఈ నాలుగేళ్లలో నిలబెట్టుకున్నాం కాబట్టే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు అవసరమైన ప్రతి పనిని చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్ కూరపాటి సుబ్బరత్నమ్మ, నాయకులు చాంద్‌బాషా, మోహన్ నాయుడు, కూరపాటి కరీముల్లా, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుమ్మడి వెంకటసుబ్బయ్య, మన్నెమాల సుధీర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మహేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(అర్బన్): 'ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పేదలందరికీ ఇళ్ల ప్రధాన కార్యక్రమం. అందువల్ల అధికారులు ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలు సాధించాలి.' అని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో జరిగిన సమావేశంలో జగనన్న లేఅవుట్లలో చేపట్టిన పనులను మండలాల వారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అందువల్ల సచివాలయ స్థాయిలో లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రజాప్రతినిధుల సహకారంతో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జరుగుతున్న పనులు, బిల్లులు తదితర విషయాలను ఎప్పటికప్పుడు యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సాయానికి అదనంగా డ్వాక్రా మహిళలకు మరో రూ.35 వేల రుణాలను ఇవ్వాలన్నారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, హౌసింగ్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు వెంకటదాసు, సాంబశివారెడ్డి, రవీంద్ర, డ్వామా పీడీ వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



నాడు–నేడు పనులపై మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నాడు – నేడు పనులు వేగవంతం చేయాలి

మనబడి నాడు–నేడు పనులను వేగవంతంగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో రెండో విడత నాడు–నేడు పనులను జూన్ 2వ వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓలు, ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. రోజూ పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. మేస్త్రీలు, కూలీలు అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి అదనంగా పిలిపించుకోవాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు రూ.84 కోట్లు ఖర్చు చేశారని, ఇంకా రూ.48 కోట్ల నిధులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- రేపట్నుంచి 26వ తేదీ వరకు..
- జిల్లాకు చేరిన 2.10 లక్షల జవాబుపత్రాలు
- 219 మంది చీఫ్ ఎగ్జామినర్ల నియామకం
- రోజుకు 40 పేపర్ల చొప్పున మూల్యాంకనం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంగళవారంతో పరీక్షలు పూర్తిగా ముగుస్తాయి. బుధవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు జవాబుపత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. తొలిసారిగా నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలురు ఉన్నత పాఠశాలలో ఈ ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా పాఠశాలల్లో 30 గదులను కేటాయించి పూర్తిస్థాయిలో వసతులు కల్పించారు. తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్, ఫ్యాన్లు తదితర వాటిని సిద్ధం చేశారు. డ్యూటీలు వేసిన ఉపాధ్యాయులు బుధవారం ఉదయం 7.30 గంటలకు ఆయా పాఠశాలల్లో రిపోర్ట్ చేయాలి. వారిని ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా రిలీవ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని ఆదేశించారు. జిల్లాకు మొత్తం 2.10 లక్షలు జవాబుపత్రాలు చేరాయి. వాటిని భద్రపరిచి ఎవరూ వెళ్లకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఆ శాఖ అధికారులకు ముందే సమాచారం అందించారు.

ఎంతమందంటే..

ప్రస్తుతం డీ కోడింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మూల్యాంకనం కోసం 219 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 458 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 214 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 40 జవాబుపత్రాలను దిద్దాలి. ఉదయం 20 పేపర్లు, మధ్యాహ్నం 20 పేపర్లు ఇస్తారు. కాగా మూడుస్థాయిల్లో వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. చీఫ్ ఎగ్జామినర్ రోజుకు 60 పేపర్ల, అదే విధంగా డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ రోజుకు 45 పేపర్లను వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. వీరితోపాటు డీఈఓ రోజుకు 20 పేపర్లను చూడాలి. కాగా మూల్యాంకనం చేసే సమయంలో బయట వ్యక్తులకు అనుమతి లేదు. ఒక్కో పేపర్ దిద్దినందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు రూ.6.60 రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది.



మూల్యాంకనం జరిగే జెడ్పీ పాఠశాల

మినహాయింపు లేదు

మూల్యాంకనం కోసం వేసిన డ్యూటీల్లో ఎవరికీ మినహాయింపు లేదు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా విధులకు హాజరుకావాలి. జవాబుపత్రాల మూల్యాంకనంలో తప్పులు చోటు చేసుకున్నా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటాం.

– గంగాభవాని, డీఈఓ

షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక నేడు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం స్త్రీ, పురుషుల షూటింగ్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని షూటింగ్‌బాల్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 22, 23వ తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణపత్రాలు, మూడు ఫొటోలు తీసుకుని ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 94903 20435, 98488 28900 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య


రజిత మృతదేహం

ముత్తుకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన ముత్తుకూరు మండలం పంటపాళెం పంచాయతీలోని కోళ్లమిట్టలో జరిగింది. ఎస్సై శివకృష్ణారెడ్డి కథనం మేరకు బోయపాటి రజిత(36)కు కొడవలూరు మండలం కమ్మపాళెనికి చెందిన వెంకటహరితో 2010లో వివాహమైంది. నాలుగేళ్ల క్రితం భర్తతో విడిపోయిన ఆమె తన ఇద్దరు పిల్లలతో కోళ్లమిట్టలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి పడకగదిలోకి వెళ్లిన ఆమె మళ్లీ వెలుపలకు రాలేదు. అనుమానంతో పిల్లలు పొరుగువారికి కబురు చేయగా, కిటికీలో నుంచి చూసిన వారికి రజిత ఫ్యానుకు ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకొన్న ఎస్సై శివకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సోమవారం తెలిపారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన రజిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

నిర్ణీత గడువు లోపు సమస్యలు పరిష్కరించాలి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


బాధితుడు మస్తానయ్య నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'స్పందన' ఫిర్యాదుల్లో పేర్కొన్న సమస్యలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 88 మంది తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి ఫిర్యాదులను పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీసు అధికారులతో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. చోరీ కేసుల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రికవరీ చేయాలన్నారు. ఆలుమగల కేసుల్లో తొందరపాటు నిర్ణయాలు తగవని, పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాలు చక్కదిద్దేందుకు చొరవ చూపాలని తెలిపారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగాల పేరిట మోసపోయిన వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రేమ పేరిట వంచన ఘటనలు అధికమవుతున్నాయని, యువతులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనంతరం ఫిర్యాదుదారులకు భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, ఎస్సీ ఎస్టీ సెల్-2, ఏఆర్ డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించారు

ఏఆర్ కానిస్టేబుల్ హజరత్తయ్య నాకు బాగా తెలుసు. పోలీసు అధికారులతో పరిచయాలు ఉన్నాయని నన్ను నమ్మించాడు. నా కుమారుడికి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని మూడేళ్ల క్రితం రూ.5 లక్షలు నగదు తీసుకున్నాడు. సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగం మాత్రం ఇప్పించలేదు. తన వద్ద తీసుకున్న నగదు తిరిగి ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోలేదు. విచారించి తగిన చర్యలు తీసుకోండి.

– మస్తానయ్య, సుందరయ్యకాలనీ, పడారుపల్లి

బెదిరిస్తున్నారు

నేను బాలాజీనగర్‌కు చెందిన మాల్యాద్రి 2016లో ప్రేమ వివాహం చేసుకున్నాం. మాకు ఓ పాప ఉంది. నా భర్త అదనపుకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడు. గత నెల 14న నాపై దాడి చేసి ఇంట్లో నుంచి గెంటేశాడు. బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఈ నేపథ్యంలో నా భర్తపై నేనిచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని దిశ ప్రొటెక్షన్ ఫోర్స్ పేరిట ఓ మహిళ బెదిరిస్తోంది. విచారించి న్యాయం చేయండి.

– వివాహిత, ఈదూరు

ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్ట్ ఆర్థికసాయం

• రూ.2.85 లక్షలు అందజేసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


నగదు డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కొడవలూరులో పలువురికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.2.85 లక్షల ఆర్థికసాయం అందించారు. వెంకన్నపురానికి చెందిన ఉప్పాల యామిని, యశ్విత తండ్రిని కోల్పోగా వారికి ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున మొత్తం రూ.40 వేలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు. కొడవలూరు ఎస్సీకాలనీలో తండ్రిని కోల్పోయిన పొన్నూరు నిఖిలేష్, హరితలకు రూ.20 వేల చొప్పున మొత్తం రూ.40 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు. కొడవలూరుకు చెందిన మన్యం అక్షయ తల్లిదండ్రులను కోల్పోగా రూ.25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కొడవలూరు వలంటీర్ అరగల శిరీష ఇంటి బేస్మెంట్ కోసం రూ.20 వేలు సాయం అందించారు. ఆ గ్రామానికే చెందిన మల్లెల జయరాజ్ కంటి ఆపరేషన్ నిమిత్తం రూ.20 వేలు అందజేశారు. ఎన్టీఆర్ గిరిజనకాలనీలో 5 గిరిజన కుటుంబాలకు ఇంటి పునాదుల నిమిత్తం రూ.10 వేల వంతున రూ.50 వేలు సాయమందించారు. ఇదే ప్రాంతానికి చెందిన దివ్యాంగుడు షేక్ అబ్దుల్‌రహీంకు రూ.10 వేలు అందజేశారు. స్థానిక దర్గా సంఘానికి చెందిన గంగపట్నం సుధారాణికి ఇంటి పునాదుల కోసం రూ.15 వేలు సాయమందించారు. అదే ప్రాంతానికి చెందిన క్యాన్సర్ బాధితుడికి మందుల నిమిత్తం రూ.20 వేలు అందజేశారు. కొడవలూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాల కోసం రూ.40 వేలు అందజేశారు.

• మండుటెండలో రక్షణ ఇలా..



రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. నెల్లూరులో తన బైక్‌కు ప్రత్యేకంగా టాప్‌ను ఏర్పాటు చేసుకుని ప్రయాణిస్తున్న వాహనదారుడిని సోమవారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.77
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 128



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

• ఏపీ జేఏసీ అమరావతి నూతన కార్యవర్గం ఎన్నిక


ఏపీ జేఏసీ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి సంఘం కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పురమందిరం మిద్దె మీద హాలులో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఉద్యోగులతో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపడుతున్నామని తెలిపారు. 25న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో నిరసన ప్రదర్శనలు చేస్తామని, 29న సచివాలయ ఉద్యోగులతో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులపై కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారందరితో ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. నూతన కార్యవర్గం జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెవెన్యూశాఖ నుంచి జిల్లా చైర్మన్‌గా అల్లంపాటి పెంచలరెడ్డిని, సెక్రటరీ జనరల్‌గా ఏపీపీటీడీ అసోసియేషన్ నాయకుడు ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అసోసియేట్ చైర్మన్‌గా ఈపీఎం శరత్‌బాబు(ఆర్‌అండ్‌బీ అసోసియేషన్), కో చైర్మన్లుగా చెంచురామయ్య(హెడ్మాస్టర్స్‌అసోసియేషన్), మురళి(రెవెన్యూ), మునీంద్ర(ఎస్‌ఎల్‌టీ అసోసియేషన్), ఇ.సుబ్రహ్మణ్యం(4వతరగతి ఉద్యోగుల అసోసియేషన్), సుబ్బారామిరెడ్డి(కోఆపరేటివ్ ఎంప్లాయీస్ అసోసియేషన్), వైస్ చైర్మన్లుగా లక్ష్మీనారాయణ, చైతన్య కిషోర్, రమేష్, బాలకోటమ్మలను, కార్యదర్శులుగా శ్రీకాంత్, చిన్నయ్య, రమణయ్య, మాధవిలను, నిర్వహణ కార్యదర్శిగా చిరంజీవిని, ప్రచార కార్యదర్శిగా సురేష్ బాబును, కోశాధికారిగా బాబూరావును ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని విధి నిర్వహణలో మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు ప్రమాద బీమా, కార్పస్‌ఫండ్, విడో ఫండ్ చెక్కులు, ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులకు ఆర్థిక చేయూతలో భాగంగా సోమవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నగదు చెక్కులను పంపిణీ చేశారు. కొండాపురం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి కుటుంబానికి గ్రూప్ పర్సనల్ బీమా(జీపీఏఐ)కింద మంజూరైన రూ.20,65,000 చెక్కును అతని సతీమణి పద్మావతికి అందజేశారు. ఇస్కపల్లి మెరైన్ స్టేషన్‌లో పనిచేస్తూ ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ సురేష్ కుటుంబానికి జీపీఏఐ కింద మంజూరైన రూ.20,90,000చెక్కును అతని భార్య వాణికి అందజేశారు.

అడిషనల్ కార్పస్‌ఫండ్ చెక్కులు

దిశ స్టేషన్‌లో బి.రమేష్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందగా ఆయన సతీమణి లక్ష్మీదేవికి, డీసీఆర్‌బీలో టి.చైతన్యక్రాంతి ఎస్సైగా విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆమె తల్లి నాగమణికి, వి.సత్రంలో బి.మల్లికార్జున హెచ్‌సీగా పనిచేస్తూ మృతిచెందగా ఆయన సతీమణి రాజేశ్వరికి, డీఏఆర్‌లో ఆర్.వెంకటేశ్వరరావు ఏఆర్ హెచ్‌సీగా పనిచేస్తూ మృతిచెందగా ఆయన కుమారుడు మోహన్‌తేజ, ఎ.వెంకటేశ్వర్లు ఏఆర్‌ఎస్‌గా పనిచేస్తూ మృతిచెందగా ఆయన సతీమణి పద్మావతికి రూ.లక్ష చొప్పున కార్పస్‌ఫండ్ చెక్కులను ఎస్పీ అందజేశారు. ఇందుకూరుపేట స్టేషన్‌లో జి.భాస్కర్‌రావు హోంగార్డుగా పనిచేస్తూ మృతిచెందగా ఆయన భార్య కాంచనకు విడో ఫండ్ కింద రూ.50 వేల చెక్కును అందజేశారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు..

బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌లో ఎస్.వెంకటశేషయ్య హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందగా జిల్లాలోని హోమ్‌గార్డులందరూ తమ ఒక్కరోజు వేతనాన్ని రూ.4,01,860 వితరణ చేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో వెంకటశేషయ్యకు ఎస్పీ అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన మరో హోంగార్డు పి.లక్ష్మయ్యకు రూ.4,16,761 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సదుపాయాలు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు శేష జీవితం హాయిగా గడపాలని, ఎప్పుడు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, డీపీఓ ఏఓ విజయకుమార్, సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష, హోంగార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్, ఆర్‌ఐ పోల్‌రాజు, మృతుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బలోపేతానికి చర్యలు

• ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్


గ్యారేజ్‌లో బస్సుల కండిషన్ వివరాలు తెలుసుకుంటున్న ఈడీ ఆదాం సాహెబ్

ఆత్మకూరురూరల్: సమస్యలను అధిగమించి సిబ్బంది సహకారంతో ఆర్టీసీ మరింత బలోపేతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఆ సంస్థ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్ పేర్కొన్నారు. ఆత్మకూరులోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఆయన వివిధ విభాగాలను తనిఖీ చేశారు. తొలుత ఆర్టీసీ గ్యారేజీని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. అనంతరం డిపో మేనేజర్ కరీమున్నీసా, ఏఎంఎఫ్ వర్మ, సెక్యూరిటీ హెడ్‌నాగేశ్వరరావులతో కలిసి బస్సుల కండిషన్‌ను తనిఖీ చేశారు. పలు బస్సులు నిర్వహణ లేక దుమ్ముపట్టి పోవడం, బస్సులోని పలు విభాగాలు సక్రమంగా నిర్వహించకపోవడం తదితర అంశాలపై ఈడీ అధికారులను ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదాయం పెంపునకు ప్రణాళికలు

డిపోలో తనిఖీల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో లోపాలను సరిదిద్ది ఆదాయం పెంచుకొనేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నెల్లూరు జోన్ పరిధిలో ఐదేళ్ల కాలపరిమితికి లోబడి వ్యాపార సముదాయాలు నిర్వహించుకొనేందుకు నెల్లూరు, ఒంగోలు జిల్లాలో 30 స్థలాలను లీజు ప్రాతిపదికన ఇప్పటికే కేటాయించామని, మరో 20 స్థలాలను 15 ఏళ్ల లీజుపై నిబంధనల ప్రకారం కేటాయిస్తామని తెలిపారు. కొత్తగా 17 అద్దె బస్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆయన వెంట నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎంలు రవికాంత్, చిరంజీవి, ఆర్టీసీ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ సుభాషణం తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ మద్యం షాపు నుంచి ప్రైవేట్‌కు..

• మద్యం తరలిస్తూ పట్టుబడిన సిబ్బంది
• 168 బీర్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

కందుకూరు: ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ప్రైవేట్ బార్ అండ్ రెస్టారెంట్లకు మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన ఆదివారం రాత్రి కందుకూరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై హనీఫ్ తెలిపిన వివరాల మేరకు విక్కిరాలపేట రోడ్డులోని మద్యం దుకాణంలో కాలేషా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే రేగలగడ్డ వెంకటేశ్వర్లు, దారం మహేష్ అనే యువకులు సేల్స్ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. వీరంతా కలిసి ఆదివారం రాత్రి మద్యం దుకాణం నుంచి 168 బీర్ బాటిల్స్ పట్టణంలోని ఓ రెస్టారెంట్‌కు తరలిస్తున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో దాడి చేసి పట్టుకున్నారు. వీరి ముగ్గురితోపాటు రెస్టారెంట్‌లో పనిచేసే శివకుమార్‌ను, షేక్ ఆసిఫ్ అనే మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వీరికి 14 రోజుల రిమాండ్ విధించారు.